సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 26 । జూన్ । 2023



నూతన మండలంగా ఇర్విన్

మాడ్గుల మండలంలోని ఇర్విన్ గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. 8లో▸



కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

రానున్న ఎన్నికల్లో మహేశ్వరంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. 8లో▸



దైవచింతనతో ప్రశాంతత

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

డిగ్రీలో సీట్ల భర్తీకి ఆహ్వానం

తుక్కుగూడ: మున్సిపాలిటీ కేంద్రంలోని తెలంగాణ బీసీ గురుకుల డిగ్రీ కళాశాల వివిధ కోర్సుల్లో సీట్ల భర్తికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జంగం విరూపాక్షప్ప ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ గ్రూప్‌లో ఎంఎస్‌సీఎస్, ఎంఎస్‌డీఎస్, ఎంఎస్‌ఏ, బీజెడ్సీ, బీకామ్ కంప్యూటర్, బీబీఏ, బీఏలో ఈపీఐఆర్, యంఈఎస్‌లో సీట్లు ఉన్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో జూన్ 4వ తేదీ లోపు నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందాలని సూచించారు. పూర్తి వివరాలకు 99892 69715, 90106 72876 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉరివేసుకొని హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్య



మాణిక్యం (ఫైల్)

శంకర్‌పల్లి: ఉరి వేసుకొని మోకిల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మారేపల్లికి చెందిన మీసాల మాణిక్యం (52) సంగారెడ్డిలోని అయ్యప్ప కాలనీలో నివసిస్తున్నారు. సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించేవాడు. ఇటీవల హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతిపై సైబరాబాద్ పరిధిలోని మోకిల పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. ఈ నెల 10న బాధ్యతలు స్వీకరించాడు. ఆదివారం సంగారెడ్డిలోని తన నివాసంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య ప్రశాంతి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. మోకిల సీఐ నరేష్, ఎస్ఐ కృష్ణ సంగారెడ్డికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

యాచారం: ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. మండల పరిధిలోని చింతుల్లలో ఆదివారం సీపీఎం మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను కాలరాసిందన్నారు. మత ఘర్షణలు, మహిళల మీద దాడులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. దేశ వ్యాప్తంగా గుడిసెలున్న వారందరికీ సొంత ఇళ్లు నిర్మిస్తామని చెప్పి మోసం చేసిందని అన్నారు. దేశ వ్యాప్తంగా రైతుల ఆగ్రహాన్ని చవి చూసిన మోదీ ప్రభుత్వం కొన్ని నల్లా చట్టాలను రద్దు చేసుకుందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ ఇళ్ల స్థలాలు లేని పేదలకు సొంత ఇళ్లు నిర్మించి ఇస్తామని, దళితులకు మూడెకరాల భూమి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, వ్యవసాయ పంటలకు రుణమాఫీ చేస్తామని చెప్పి విస్మరించిందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడం ఖాయమని అన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, కార్యదర్శి వర్గ సభ్యులు ఆలంపల్లి జంగయ్య, చందునాయక్, ధర్మన్నగూడెం సర్పంచ్ బాషయ్య, నాయకులు వినోద్‌కుమార్, విప్లవ్ కుమార్, మస్కు మహేందర్ పాల్గొన్నారు.

మందగించిన చూపు

23.76శాతం మందికి దృష్టిలోపం

- 1,03,259 మందికి దగ్గరి చూపు సమస్య
- 92,912 మందికి దూరదృష్టి ఇబ్బంది
- కంటివెలుగు స్క్రీనింగ్‌లో బహిర్గతం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: సాధారణంగా ఆరు పదుల వయసు దాటిన వారిలో కనిపించే దృష్టి లోపాలు.. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లకు తోడు రోజంతా కంప్యూటర్లు, ఫోన్లు, టీవీ స్క్రీన్లకు అతుక్కుపోయి కూర్చోవడంతో పదేళ్ల వయసులోనే బయటపడుతున్నాయి. ప్రభుత్వం నిర్వహిస్తున్న 'కంటి వెలుగు' స్క్రీనింగ్‌లో 23.76 శాతం మంది దృష్టి లోపంతో బాధపడుతున్నట్లు తేలింది. కొంత మంది దగ్గరిచూపు సమస్యతో బాధపడుతుంటే.. మరికొంత మంది దూరపు చూపు సమస్యతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. ఇదిలా ఉండగా ఇప్పటికే మెజార్టీ క్యాంపులు మూతపడగా.. మరోవైపు కంటి వెలుగు క్యాంపుల్లో పరీక్షలు చేయించుకున్న బాధితుల్లో చాలామందికి ఇప్పటికీ రీడింగ్, ప్రిస్క్రిప్షన్ గ్లాసులు అందలేదు.

8.25 లక్షల మందికి స్క్రీనింగ్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కంటి వెలుగు' పథకంలో భాగంగా ఈనెల 12 వరకు జిల్లా వ్యాప్తంగా 80 బృందాలు 8,25,035 మందికి స్క్రీనింగ్ చేశాయి. వీరిలో 1,03,259 మంది దగ్గరి చూపు సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి రీడింగ్ గ్లాసులను సిఫార్సు చేశారు. మరో 92,912 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసులను సిఫార్సు చేశారు. వీరిలో ఇప్పటి వరకు 59,580 మందికి వీటిని సరఫరా చేశారు. మరో 33,132 మందికి అందజేయాల్సి ఉంది. ఇప్పటి వరకు స్క్రీనింగ్ చేసిన వారిలో 76.24 శాతం మందికి ఎలాంటి సమస్యలు లేవని తేలింది. మరో 23.76 శాతం మందికి మాత్రమే కంటి చూపు సమస్య ఉన్నట్లు నిర్ధారణ అయింది. కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వారిలో 40 ఏళ్లలోపు వారు 12,934 మంది ఉండగా, ఆపై వయస్సు వాళ్లు 90,004 మంది ఉండ టం గమనార్హం. విటమిన్ ఏ లోపానికి తోడు, ఆకుకూరలు సరిగా తినకపోవడం, కంప్యూటర్, టీవీ, సెల్‌ఫోన్ స్క్రీన్లకు గంటల తరబడి అతుక్కుపోవడమే ఇందుకు కారణమని వైద్యనిపుణులు అభిప్రా యపడుతున్నారు.

ముగిసిన క్యాంపులు.. మూలన గ్లాసులు

మొదటి విడత కంటి వెలుగు పథకానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వం రెండో విడత వంద రోజుల కంటి వెలు గు కార్యక్రమాన్ని ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా 80 బృందాలను ఎంపిక చేసి, కమ్యూనిటీ కేంద్రాలు, వార్డు కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాల్లోనూ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఒక్కో శిబిరానికి ఒక డాక్టర్ సహా ఆప్తమిస్ట్, ఏఎన్ఎంలు, డేటాఎంట్రీ ఆపరేటర్లను ఎంపిక చేసి ఐదు నెలలుగా స్క్రీనింగ్ నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఒకటి రెండు మినహా మెజార్టీ క్యాంపులు మూత పడ్డాయి. ఒకవైపు క్యాంపుల గడువు ముగుస్తున్నా.. ఇప్పటికీ మెజార్టీ బాధితులకు ప్రిస్క్రిప్షన్ అద్దాలు అందకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపానికి తోడు సిబ్బంది నిర్లక్ష్యంతో రీడింగ్ గ్లాసులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలోనే మగ్గిపోతున్నాయి. ఇదిలా ఉండగా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఎంపిక చేసిన వాహనాలకు ప్రభుత్వం ఒక్కో వాహనానికి రూ.33 వేలు చెల్లిస్తుండగా, ఏజెన్సీ మూడు వేలు కట్ చేస్తుండటం విశేషం. అంతే కాదు క్యాంపుల్లో పాల్గొన్న సిబ్బందికి చెల్లించాల్సిన టీ, బిస్కెట్, మధ్యాహ్న భోజనం బిల్లులను సైతం ఆయా ఆరోగ్య కేంద్రాల పరిధిలోని మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లే నొక్కేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

హలో రైతన్న రైతుబంధు వద్దా..

- పట్టాదారు, పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్లు ఇవ్వండి
- నగరంలో స్థిరపడిన రైతులకు వ్యవసాయ అధికారుల ఫోన్లు
- పథకాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి



నక్కర్తమేడిపల్లిలో నగరానికి చెందిన ఓ రైతు కొనుగోలు చేసిన వ్యవసాయ భూమి

యాచారం: 'హలో.. హలో రైతన్న.. ఫోను వినబడుతుందా.. నేను వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి ఫోను చేస్తున్నా.. నీకు రైతుబంధు పథకం కింద డబ్బులు వద్దా.. వెంటనే మీ పట్టాదారు, పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్ల జిరాక్స్ పత్రాలు ఇచ్చి వెళ్లండి' అంటూ యాచారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి రైతులకు ఫోన్లు చేస్తున్నారు. వ్యవసాయ భూములుండి, పట్టాదారు, పాసుపుస్తకం ఉన్న రైతులకు వానాకాలం పంటలకు పెట్టుబడి సాయం కింద రైతుబంధు పథకం వర్తింపజేసేలా వ్యవసాయాధికారులు కృషి చేస్తున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామా ల్లో దాదాపు 28 వేలకు పైగా పట్టాదారు, పాసుపుస్తకాలు పొందిన రైతులు ఉన్నారు. అందులో ఫార్మాసిటీకి భూములు సేకరించిన 5,500 మందికి పైగా ఉన్నారు. ఇంకా 22వేలకుపైగా రైతుబంధు అర్హులైన రైతులు ఉన్నారు. యాసంగి కింద 14,576 మందికి ఎకరాకు రూ.5వేల చొప్పున రూ.19,70,63,312 పెట్టుబడి సాయం అందించారు.

జూలై 3 వరకు నమోదు గడువు

వానాకాలం పంట కింద రైతుబంధు పథకం అందజేయడానికి సర్కార్ కొత్తగా పట్టాదారు, పాసుపుస్తకాలు పొందిన రైతులకు జూలై 3వ తేదీ వరకు నమోదు చేసుకునే అవకాశం ఉంది. దీంతో వ్యవసాయాధికారులు పట్టాదారు, పాసుపుస్తకాలు పొందిన ప్రతి రైతుకు రైతుబంధు పథకం అందేలా కృషి చేస్తున్నారు. మండలంలో వివరాలు ఇవ్వని వారు ఇంకా 2,393 మంది ఉన్నారు. మంతన్‌గౌరెల్లి, చింతపట్ల, యాచారం, మొండిగౌరెల్లి, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, నల్లవెల్లి, మాల్ తదితర గ్రామాల్లో కొత్తగా పట్టాదారు, పాసుపుస్తకాలు పొందిన రైతులు ఉన్నారు. మాల్, నక్కర్తమేడిపల్లి, చౌదర్‌పల్లి, యాచారం కేంద్రాల్లో ఉన్న రైతువేదికల వద్ద వ్యవసాయ శాఖ అధికారులు నిత్యం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండి రైతులకు ఫోన్లు చేసి వివరాలు సేకరిస్తున్నారు. సర్కార్ ఈ నెల 26 నుంచి రైతుల ఖాతాల్లో రైతు బంధు డబ్బులు జమ చేయనుంది. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు 5 గుంటల నుంచి 10 గుంటల వరకు భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అలాంటి వారు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు.

పథకం అందాలనే..



ప్రతి రైతు సర్కార్ అందజేసే రైతుబంధు పథకం కింద డబ్బులు పొందాలనే ఉద్దేశంతో ఫోన్లు చేసి వివరాలు ఇవ్వాలని అడుగుతున్నాం. గ్రామాల వారీగా వివరాలు తీసుకుని ఫోన్ చేస్తున్నాం. ఆన్‌లైన్‌లో నమోదుకు జూలై 3 వరకు అవకాశం ఉంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– సందీప్‌కుమార్, వ్యవసాయాధికారి

మౌలిక వసతుల కల్పనకు కృషి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: ప్రజా అవసరాలు తెలుసుకొని మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో ఆదివారం సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. గత వారం మహేశ్వరం మండలంలోని తుమ్మలూరులో జరిగిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ ఈ మున్సిపాలిటీకి రూ.25 కోట్లు మంజూరు చేయడాన్ని గుర్తు చేశారు. ఈ ప్రాంతం యువతకి ఉపాధి కేంద్రంగా మారిందన్నారు. ఇప్పటికే ఈ-సిటీ, హర్డ్‌వేర్‌పార్క్, 58 కంపెనీలు వచ్చాయన్నారు. మరో 9 నెలల్లో ఫాక్స్‌కాన్ సంస్థ పూర్తవుతుందని మరో లక్ష మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధుమోహన్, కమిషనర్ బి.వెంకట్రాం, వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ రవినాయక్, సుమన్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్, ఏఈఈ కె.భార్గవ్‌రెడ్డి, నాయకులు సప్పిడి రాజు, శ్రీకాంత్, శ్యామేల్ రాజు, ముప్పిడి శ్రీధర్, బుచ్చిరెడ్డి, వెంకట్‌రాజిరెడ్డి, శ్రీలత, పద్మ, హరికృష్ణరెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.

ముగిసిన తేజస్విని అంత్యక్రియలు



తేజస్విని రెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

తుర్కయంజాల్: లండన్‌లో దుండగుడి చేతిలో ఈ నెల 13న దారుణహత్యకు గురైన మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన కొంతం తేజస్విని రెడ్డి (27) మృతదేహం 13 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత ఆదివారం స్వగ్రామానికి చేరుకుంది. ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మృతదేహం రాగా, కుటుంబ సభ్యులు అక్కడి నుంచి బ్రాహ్మణపల్లిలోని ఇంటికి తీసుకువచ్చారు. ఆమె మృతదేహం ఇంటికి చేరిన వెంటనే తల్లిదండ్రులతో పాటు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ తదితరులు తేజస్విని మృతదేహానికి నివాళులు అర్పించి, తల్లిదండ్రులను ఓదార్చారు. అనంతరం అంత్యక్రియలను నిర్వహించారు.

ఉప్పల్‌లో తిప్పలుండవ్!

- రింగ్‌రోడ్డులో ఆకాశ నడక మార్గం సిద్ధం
- స్కైవాక్‌ను నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్



సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి తూర్పు దిక్కున మరో మణిహారం సిద్ధమైంది. ఉప్పల్‌లో వద్ద పాదచారులు రోడ్డు దాటేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆకాశ నడక మార్గం సోమవారం నుంచి అందుబాటులోకి రానుంది. మంత్రి కేటీఆర్ నేడు ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. రామంతాపూర్, సికింద్రాబాద్ వైపు నుంచి ఎల్‌బీనగర్ వైపు, ఉప్పల్ నుంచి రామంతాపూర్, సికింద్రాబాద్ వైపు.. ప్రతి రోజు వేలాది మంది పాదచారులు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దూరప్రాంతాల నుంచి నగరానికి చేరుకొనే ప్రయాణికులు ఉప్పల్ రింగురోడ్డు వద్ద రోడ్డు దాటేందుకు ప్రయాస పడుతుండేవారు. మెట్రో స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే సుమారు 30 వేల మందికి పైగా ప్రయాణికులు సైతం ఎటు వైపు వెళ్లాలన్నా ఇబ్బందిగానే ఉండేది. ఈ క్రమంలో ఈజీగా రోడ్డు దాటేందుకు వీలుగా ఏర్పాటు చేసిన స్కైవాక్‌తో ఉప్పల్ రింగురోడ్డు వద్ద పాదచారులు ఎలాంటి ఆటంకం లేకుండా రాకపోకలు సాగించనున్నారు.

నగరంలోనే మొదటిది..

దాదాపు రూ.25 కోట్లతో హెచ్ఎండీఏ ఉప్పల్ స్కైవాక్‌ను నిర్మించింది. 660 మీటర్ల పొడవు ఉన్న ఈ ఆకాశ నడక మార్గం నగరంలో మొట్టమొదటి నిర్మాణం. రాబోయే వందేళ్ల పాటు వినియోగంలో ఉండేలా ప్రజల అవసరాలకు అనుగుణంగా స్కైవాక్‌ను ఎంతో పటిష్టంగా నిర్మించినట్లు హెచ్ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. దీనికోసం సుమారు వెయ్యి టన్నులకు పైగా స్ట్రక్చరల్ స్టీల్‌ను వినియోగించారు. వివిధ రకాల స్కైవాక్ నమూనాలను పరిశీలించిన అనంతరం హెచ్ఎండీఏ ప్రస్తుతం ఉన్న ఏర్పాటును ఖరారు చేసింది. ఇందుకోసం హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. 2020లోనే పనులు ప్రారంభించినప్పటికీ కోవిడ్ కారణంగా నిర్మాణంలో జాప్యం నెలకొంది. ఎట్టకేలకు ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకొని వినియోగంలోకి రానుంది.

బహుళ ప్రయోజన ఫంక్షన్ హాల్‌కూ శ్రీకారం

ఉప్పల్ శిల్పారామం వద్ద హెచ్ఎండీఏ నిర్మించిన బహుళ ప్రయోజనాల ఫంక్షన్‌హాల్‌ను కూడా మంత్రి కేటీఆర్ సోమవారం నాటి పర్యటనలో ప్రారంభించనున్నారు. పెళ్లిళ్లు, పుట్టినరోజు వంటి వేడుకలు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు వీలుగా ఈ ఫంక్షన్ హాల్ నిర్మించారు. శిల్పారామం వద్ద చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఫంక్షన్ హాల్‌ను ఏర్పాటు చేశారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వినియోగ చార్జీలు ఉంటాయని అధికారులు తెలిపారు.

స్కైవాక్ ప్రత్యేకతలు ఇవీ..

- మొత్తం పొడవు 660 మీటర్లు
- 37 పిల్లర్లు ఏర్పాటు చేశారు
- 3, 4, 6 మీటర్ల వెడల్పు కలిగి.. భూ ఉపరితలం నుంచి 6 మీటర్ల ఎత్తు
- నిర్మాణ వ్యయం : రూ.25 కోట్లు
- 8 లిఫ్టులు, 6 స్టేర్ కేసులు, 8 ఎలివేటర్లు
- బ్యూటిఫికేషన్ లుక్ కోసం పైభాగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 40 శాతం మేరకు రూఫ్ టాప్
- ప్రతిరోజు 20 వేల మందికి పైగా పాదచారులు, మరో 25 వేల మందికి పైగా మెట్రో ప్రయాణికులు స్కైవాక్‌ను వినియోగించుకోవచ్చు.
- ఉప్పల్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ ఫ్రీగా చేయడంతో వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం ఉండదు.
- మెట్రో ప్రయాణికులు కాంకోర్ వరకు చేరుకుంటారు.

పేలిన ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీ

గృహోపకరణాలు పూర్తిగా దగ్ధం

లాలాపేట: చార్జింగ్ పెట్టిన ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీ పేలి ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన ఆదివారం లాలాగూడ పోలీసు స్టేషన్ పరిధిలోని లాలాపేట ఇందిరానగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇందిరానగర్ బి కాలనీకి చెందిన డానియేల్ తన ఇంటి మొదటి అంతస్తులోని బాల్కనీలో ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీ చార్జింగ్ పెట్టి ఓ వృద్ధురాలిని, 5 ఏళ్ల చిన్నారిని ఇంట్లో వదిలిపెట్టి మిగతా కుటుంబ సభ్యులు చర్చికి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత బాల్కనీలోని బ్యాటరీ నుంచి పొగలు రావడంతో భయంతో వృద్ధురాలు తలుపులు పెట్టకుని లోపలే ఉంది. కొంత సేపటికి దట్టమైన పొగలతో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు రామువర్మ, మహేశ్ తదితరులు భవనం మొదటి అంతస్తుకు వెళ్లి ఇంట్లో ఉన్న వృద్ధురాలిని, చిన్నారిని సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. అప్పటికే మంటలు పూర్తిగా అంటుకుని హాల్లోని ఫర్నిచర్, సోఫాలు, టీవీ, దుస్తులు, ఇతర విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ ఇంజిన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. దాదాపు రూ. 8 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు డానియేల్ ఆవేదన వ్యక్తం చేశాడు.

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నిఖిల్ ఆనంద్

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిఖిల్ ఆనంద్

షాద్‌నగర్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి కాషాయ జెండాను ఎగరేయడం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిఖిల్ ఆనంద్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం షాద్‌నగర్‌లోని అందెబాబయ్య కాంప్లెక్స్‌లో మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన కొనసాగుతోందన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకుంటున్నారని, ఖజానాను ఖాళీ చేసి తమ అవసరాలకు వాడుకుంటున్నారని ఆరోపించారు. ప్రకటనల పేరిట వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు తలదన్నేలా ఉన్నాయని అన్నారు. రాష్ట్రాన్ని దోచుకున్నది సరిపోక దేశం మీద పడ్డారని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం లక్షల కోట్లను మంజూరు చేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. సమావేశంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, డాక్టర్ విజయ్‌కుమార్, దేపల్లి అశోక్‌గౌడ్, వెంకటేశ్‌గుప్తా, మిథున్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వంశీకృష్ణ, చెట్ల వెంకటేశ్, మోహన్‌సింగ్, మురళి, రమేష్, నాగరాజు, సాయిబాబ, శ్రీనివాస్‌చారి, రుషికేష్, మణికంఠ, హరిభూషణ్, వెంకటేశ్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ అమలు చేయాలి

ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌గాంధీ గుప్తా



సమావేశానికి హాజరైన నాయకులు

హుడాకాంప్లెక్స్: ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను వెంటనే అమలు చేయాలని ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌గాంధీ గుప్తా డిమాండ్ చేశారు. సరూర్‌నగర్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణలోని వివిధ జిల్లాల కార్యవర్గ సభ్యులతో జరిగిన ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. కులవృత్తులకు అందజేస్తున్న విధంగా చిరువ్యాపారం చేసుకుంటున్న వైశ్యులకు బీసీ బంధు పథకం వర్తింపజేయాలన్నారు. వైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో సరూర్‌నగర్‌లోని జాతీయ కార్యాలయం నుంచి మహాత్మగాంధీ విగ్రహం వరకు పాదయాత్ర చేసి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు రోజారమణి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం



మోకిల గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బీఆర్‌ఎస్ మోకిల అధ్యక్షుడిగా గోపాల్‌చారిని ఎన్నుకున్న సందర్భంగా గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రధాన చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చాకే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రతిపక్ష పార్టీలకు ఓటు అడిగే హక్కు కూడా లేదన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు నాయక్, మాజీ సర్పంచ్ ఆనంద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు లింగం ముదిరాజ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ ఫరీద్, నాయకులు రవీందర్‌రెడ్డి, రామస్వామి, వెంకటేష్, హన్మంత్‌రెడ్డి, శ్రీకాంత్, రియాజ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లుకు ఏడీఏ కార్యాలయం

ఆమనగల్లు: ఆమనగల్లుకు నూతనంగా ఏడీఏ కార్యాలయం మంజూరైందని, ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి ఎం రఘునందన్‌రావ్ ఉత్తర్వులు జారీ చేశారని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తెలిపారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం ఆమనగల్లు పట్టణంలో వివిధ డివిజన్ కార్యాలయాలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కార్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. ఇప్పటికే సివిల్ కోర్టు ఏర్పాటు కాగా ఏడీఏ కార్యాలయం వచ్చిందన్నారు. త్వరలో ఆమనగల్లు పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలను కలిపి ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇకనుంచి వారానికి ఆరు రోజులు ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రతిరోజూ ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు వివిధ గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఇర్విన్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు మహేంద్రాచారి, శివ బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య యాదవ్, వెంకటయ్య గౌడ్, యాదయ్య గౌడ్, శ్రీనివాస్, యాదిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నూతన మండలంగా ఇర్విన్

- ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వ ఉత్తర్వులు: ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- సత్కరించిన ఇర్విన్ గ్రామ ప్రజాప్రతినిధులు



ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు బొకే అందజేస్తున్న ఇర్విన్ గ్రామ ప్రజాప్రతినిధులు

ఆమనగల్లు: మాడ్గుల మండలంలోని ఇర్విన్ గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయనున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడుతాయని ఆయన వెల్లడించారు. ఇర్విన్‌ను నూతన మండలంగా ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో ఆదివారం ఎమ్మెల్యేను ఆ గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ రవి, ఇర్విన్ సర్పంచ్ పుష్పలత, ఎంపీటీసీ తిరుపతమ్మ వెంకటయ్యగౌడ్ తదితరులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. గతంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇర్విన్‌ను మండలంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాడ్గుల మండలంలో 14 ఎంపీటీసీలు, 33 గ్రామ పంచాయతీలు ఉండగా ఇర్విన్ పరిధిలోకి 7 ఎంపీటీసీలు, 19 గ్రామ పంచాయతీలు వస్తాయని వివరించారు. ఈ మండలంలోకి నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని అజిలాపురం ఎంపీటీసీ పరిధిలోని 3 గ్రామాలు రానున్నట్లు చెప్పారు. త్వరలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మాడ్గుల, ఇర్విన్ మండలాలను రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధి నుంచి సైబరాబాద్ పరిధిలోకి కలుపుతామని పేర్కొన్నారు.

మహేశ్వరంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తాం



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

మహేశ్వరం: రానున్న సాధారణ ఎన్నికల్లో మహేశ్వరంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సుభాన్‌పూర్, దుబ్బచర్ల, గాంధీనగర్ తండాలకు చెందిన పలువురు యువకులు పార్టీ నియోజకవర్గ సీనియర్ నేత సీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అన్నట్లు వ్యవహరిస్తున్నాయని మండి పడ్డారు. మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకోస్తామన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన చాలా మంది కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్తలు శ్రమించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రజా సమస్యలను గాలికి వదిలేశాయని ఆరోపించారు. తెలంగాణలో కూడా కర్ణాటక ఫలితాలే వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, కల్వకోల్ మాజీ ఉప సర్పంచ్ తిరుమల యాదయ్య, నాయకులు, వార్డు సభ్యులు సుధాకర్, భాస్కర్, శశికాంత్, శ్రీను, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి



యాచారం: నాగార్జునసాగర్ – హైదరాబాద్ రహదారిపై గునుగల్ అటవీ ప్రాంతంలో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. సాగర్ రోడ్డుపై గునుగల్ అటవీ ప్రాంతంలో ఇటీవల జింకల సంచారం అధికమైంది, అటవీ ప్రాంతానికి కంచె లేక పోవడంతో జింకలు తరచూ రోడ్డుపైకి వస్తున్నాయి. ఆదివారం జింక రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడి కొద్ది సేపటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు జింక కళేబరాన్ని దహనం చేశారు.

ఆలయాల అభివృద్ధికి కేసీఆర్ కృషి

- మంత్రి సబితారెడ్డి
- బాలాపూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు



బాలాపూర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: పురాతన ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని మంత్రి సబితా రెడ్డి తెలిపారు. ఆదివారం బాలాపూర్‌లోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు చేయించినట్లు తెలిపారు. పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కోనేటి బావిని, గ్రామంలోకి బురుజును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గ కేంద్రంలో శివగంగా ఆలయం, తుక్కుగూడలోని వేంకటేశ్వర ఆలయం, ఆర్‌కేపురంలోని ఖిలా మైసమ్మ, జన్నాయిగూడలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం, జిల్లెలగూడలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి ఒక్కో గుడికి కోటి రూపాయల చొప్పున నిధులు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. వీటితో పాటు ఘట్‌పల్లి వీరాంజనేయ స్వామి, ఉప్పగడ్డ తండా సేవాలాల్ మహరాజ్ గుడికి కోటి రూపాయల చొప్పున నిధులు విడుదల అయ్యాయని పేర్కొన్నారు. ఆలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు వినియోగించాలని సూచించారు. సీఎం కేసీఆర్ కుల మతాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, నాయకులు లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి, నిరంజన్‌రెడ్డి, రఘునందన్‌చారి, గిరి, శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాపై ఫిర్యాదు

చంచల్‌గూడ: సైదాబాద్ క్రాస్ రోడ్డులో జైళ్ల శాఖకు చెందిన స్థలం ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి, అక్రమ కట్టడాలు చేపట్టిన విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఇదే అంశంపై గత శుక్రవారం బీజేపీ మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ జైళ్ల శాఖ డీజీ, సూపరింటెండెంట్‌లకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఫిర్యాదుపై విచారణ జరిపిన జైళ్ల శాఖ అధికారులు స్థలం కబ్జాకు గురైనట్లు గుర్తించారు. జైళ్ల శాఖ అధికారులు ఈ అంశంపై పోలీసు ఉన్నతాధికారులతో కూడా చర్చలు జరిపారు. స్థలం కబ్జాకు సంబంధించి జైళ్ల శాఖ అధికారులు శనివారం సాయంత్రం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అట్టి స్థలంలో అక్రమ కట్టడాలపై జీహెచ్‌ఎంసీకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. జైళ్ల శాఖ స్థలం కబ్జా వ్యవహారం మొత్తం తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జైళ్ల శాఖ డీజీ డా.జితేందర్ దృష్టికి వెళ్లింది.

రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి

కేశంపేట: ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన జంగయ్య(48) బైక్‌పై కేశంపేట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం సింగందొడ్డికి చెందిన కే చిరంజీవి, కే వంశీలు బైక్‌పై కేశంపేట వైపునకు వస్తూ మండలంలోని సుందరపురం గ్రామ గేట్ వద్ద ఢీ కొన్నాయి. తీవ్రంగా గాయపడిన జంగయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దైవదర్శనానికి వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మేడ్చల్ రూరల్: సెలవు రోజున ఇద్దరు యువకులు కీసర రామలింగేశ్వరుడి దర్శనం కోసం బైకుపై బయలుదేరగా మార్గమధ్యలో రోడ్డు ప్రమాదానికి గురై..ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మేడ్చల్ పోలీసుల వివరాల ప్రకారం..మెదక్ జిల్లా హత్నూర మండలం ఎన్‌సీఎల్ కాలనీకి చెందిన కలిశెట్టి జగదీశ్ ఆదివారం తన సహోద్యోగి గొంతిన కిరణ్‌తో కలిసి కీసర వెళ్లేందుకు తెల్లవారుజామున తన ద్విచక్రవాహనంపై ఇంటి నుండి బయదేరారు. మార్గమధ్యలో సీఎంఆర్ గ్రూప్స్ కళాశాల వద్దకు రాగానే ఉదయం 7 గంటల సమయంలో వీరి ద్విచక్ర వాహనం ఓఆర్‌ఆర్ జంక్షన్ దాటుతుండగా గుర్తుతెలియని లారీ ఢీ కొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న జగదీశ్ ముందువైపు పడిపోగా వెనుక కూర్చున్న కిరణ్ పక్కకు పడిపోయాడు. వీరి బైక్‌ను ఢీకొట్టిన లారీ జగదీశ్ శరీరంపై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందగా కిరణ్ తీవ్రగాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు ప్రమాదస్థలికి చేరుకుని పరిశీలించారు. కిరణ్‌ను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా జగదీశ్ మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోకాపేటలో భూ కబ్జాకు యత్నం

మణికొండ: పెరుగుతున్న భూముల విలువతో పాటు వాటిపై అక్రమార్కుల లీలలు కూడా పెరుగుతున్నాయి. ఏకంగా ఓ పట్టా భూమిని అక్రమించేందుకు ఓ ముఠా ప్రయత్నించిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేటలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కోకాపేట సర్వేనెంబర్ 166/4లో అరవింద్ అగర్వాల్‌తో పాటు వారి బంధువులకు 5 ఎకరాల భూమి ఉంది. అది ఎలాంటి వివాదంలో లేకపోయినా శనివారం రాత్రి పూసల శ్రీనివాస్, రవీందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో రెండు కార్లలో వారి అనుచరులు, జేసీబీలు, లారీలతో వచ్చి ఆ భూమిలో ఉన్న వాచ్‌మెన్‌ల కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేశారు. అక్కడితో ఆగకుండా అక్కడి గదులు, బాత్‌రూంలు, ప్రహరీ, గేట్‌లను కూల్చివేశారు. విషయం తెలుసుకున్న భూ యజమాని వెంటనే 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారు అక్కడకు చేరుకోగానే వారు పారిపోయారు. వచ్చిన వారిలో ఆరుగుర్ని అదుపులోకి తీసుకున్నారు.

దొంగకు దేహశుద్ధి

- మహిళ మెడలోంచి పుస్తెల తాడు అపహరణ
- వెంటపడి పట్టుకున్న యువకులు
- పోలీసులకు అప్పగింత



నిందితుడు రవీందర్

శంకర్‌పల్లి: మహిళ మెడలోని పుస్తెల తాడును తెంపుకొని పరుగెత్తుతున్న దొంగను యువకులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా, కొండాపూర్ మండలం, కోనాపూర్‌కు చెందిన సునంద ఆదివారం పని నిమిత్తం శంకర్‌పల్లికి వచ్చింది. మధ్యాహ్నం శంకర్‌పల్లిలోని కూరగాయల మార్కెట్ వైపు వెళుతుండగా దొంగ ఆమె మెడలోని మూడు తులాల పుస్తెల తాడును లాక్కొని పరుగు పెట్టాడు. బాధిత మహిళ కేకలు వేయడంతో పట్టణానికి చెందిన యువకులు శ్రీకాంత్ ముదిరాజ్, ప్రశాంత్ కుమార్, హెస్సేన్ గమనించి దొంగను వెంబడించి గణేష్‌నగర్ కాలనీలో పట్టుకున్నారు. అనంతరం దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పట్టుబడిన దొంగ పేరు రవీందర్ అని, సంగారెడ్డి జిల్లా, ఆందోల్ మండలం, రామ్సాన్‌పల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న బండ్ల గణేశ్

- సినీ నిర్మాత బండ్ల గణేశ్
- అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ.11 లక్షల విరాళం

నందిగామ: దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామ పారిశ్రామిక వాడలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి ఆదివారం ఆయన నివాసంలో రూ. 11 లక్షల 23వేల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. నందిగామలోని అయ్యప్ప ఆలయ చరిత్ర చాలా గొప్పదని, ప్రతి ఏటా కార్తీక మాసంలో ఆలయంలో వేలాది మంది మాలధారణ చేస్తారని, మూడు నెలల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గురుస్వామి సతీషన్ నాయర్, సుదర్శన్ గౌడ్, నర్సింహ యాదవ్, లక్ష్మయ్య యాదవ్, ఎంపీటీసీ కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆచూకీ లేని ఆ చిన్నారి!

- నిజామాబాద్ నుంచి కుమారుడితో వచ్చిన పర్వీన్
- హఠాత్తుగా కనిపించకుండా పోయిన బాలుడు
- ఆ తర్వాతే మహంకాళి, సుల్తాన్‌బజార్‌లలో కిడ్నాప్
- 20 రోజులుగా ముమ్మరంగా గాలిస్తున్న టాస్క్‌ఫోర్స్



సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 4 తెల్లవారుజామున మహంకాళి, సుల్తాన్‌బజార్ పోలీసుస్టేషన్ల పరిధి నుంచి ఇద్దరు చిన్నారులు కిడ్నాప్ అయ్యారు... ఫిర్యాదు అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు రెండు గంటల్లోనే కేసును ఛేదించారు... ఇరువురు నిందితులను అరెస్టు చేసి ఇద్దరు చిన్నారులనూ రెస్క్యూ చేశారు. అంతా అంతటితో కథ సుఖాంతం అనుకున్నారు. అయితే పట్టుబడిన నిందితురాలి విచారణలో 'అదృశ్యమైన' ఆమె కుమారుడి వ్యవహారం వెలుగులోకి రావడం కొత్త ట్విస్ట్. ఆ చిన్నారి ఆచూకీ కనిపెట్టడానికి నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు 20 రోజులుగా అహర్నిశలు శ్రమిస్తున్నారు.

వరుసగా రెండు కిడ్నాప్‌లు...

సికింద్రాబాద్ ప్యారడైజ్ ప్రాంతంలో మేఘరాజ్ కాలే మూడు దశాబ్దాలుగా ఫుట్‌పాత్‌పై జీవిస్తున్నాడు. చిన్న చిన్న వస్తువులు విక్రయించే ఇతడికి భార్య, ఏడుగురు సంతానం. ఈ నెల 3 రాత్రి ఎప్పటిలాగే ఫుట్‌పాత్‌పై పడుకున్నారు. మరుసటి రోజు తెల్లవారుజామున 3.40 గంటల సమయంలో ఆటోలో వచ్చిన స్త్రీ, పురుషుడు (ఆటోడ్రైవర్) ఇతడి కుమార్తె కరిష్మాను (మూడున్నరేళ్లు) అపహరించుకుని వెళ్లారు. ఇద్దరు నిందితులు ఆటోలో ఎంజీ రోడ్డు మీదుగా వెళ్లి పోయారు. నేరుగా అబిడ్స్ వైపు వెళ్లిన ఈ ద్వయం సుల్తాన్‌బజార్ పోలీసుస్టేషన్ పరిధిలోని హనుమాన్ టెక్డీ వద్ద ఫుట్‌పాత్ నివసిస్తున్న స్వీపర్ దంపతులు కుమారుడు శివకుమార్‌ను (ఏడున్నర నెలలు) కిడ్నాప్ చేశారు. వీరిద్దరినీ నిందితులు ఫలక్‌నుమ ప్రాంతంలో ఉన్న ఆటోడ్రైవర్ ఇంటికి తీసుకువెళ్ళారు. తొలి ఉదంతంపై తెల్లవారుజామున 4.15 గంటలకు పోలీసులకు ఫిర్యాదు అందింది. వెంటనే స్పందించిన పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ముమ్మరంగా గాలించిన అధికారులు రెండు గంటల్లో నిందితుల ఆచూకీ కనిపెట్టి, చిన్నారులకు రెస్క్యూ చేశారు.

సీసీ కెమెరాలను విశ్లేషించగా...

నిందితులైన షేక్ ఇమ్రాన్, పర్వీన్ విచారణ, సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాల విశ్లేషణతో మరో 'అదృశ్యం' కథ వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ జిల్లా నాగారం దొడ్డి కొమురయ్యకాలనీకి చెందిన సలీం భార్య పర్వీన్ కొన్నాళ్లుగా భర్తకు దూరంగా తల్లితో కలిసి ఉంటోంది. ఇద్దరు పిల్లలున్న ఈమె ఇంట్లో తల్లితో గొడవపడి తన కుమారుడిని (3) తీసుకుని హైదరాబాద్‌కు వచ్చింది. మద్యం, గంజాయికి బానిసైన పర్వీన్ సికింద్రాబాద్‌లో సంచరించినప్పుడు చేతిలో బాబు ఉన్నాడు. అక్కడ నుంచి గాంధీ ఆస్పత్రి వద్దకు వెళ్లినప్పుడూ కనిపించాడు. ఇదంతా ఈ నెల మూడో తేదీ ఉదయం, మధ్యాహ్నం విషయం. రాత్రి 11.45 గంటలకు కోఠి వద్ద ఇమ్రాన్ ఆటో ఎక్కే సమయంలో మాత్రం ఆమె చేతిలో తన కుమారుడు కనిపించలేదు. ఆయా ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను చూసిన పోలీసులు ఇది నిర్ధారించారు. ఈ చిన్నారి ఎలా అదృశ్యమయ్యాడు, ఏమయ్యాడు? అనే అంశాలపై టాస్క్‌ఫోర్స్ దృష్టి పెట్టింది.

కుమారుడు 'పోవడం'తోనే కిడ్నాప్

అనునిత్యం నిషాలో ఉండే పర్వీన్ తన కుమారుడిని ఎక్కడో వదిలేసింది. రాత్రి సమయంలో కాస్త స్పృహ రావడంతో తప్పిపోయిన తన బిడ్డ విషయం ఆమెకు తెలిసింది. దీంతో ఇమ్రాన్ ఆటో ఎక్కిన ఆమె తన కుమారుడి వెతుకుతూ బయలుదేరింది. కుమారుడు లేకుండా ఇంటికి వెళితే తల్లి ఊరుకోదని భావించింది. తన కుమారుడి బదులు మరొకరిని తీసుకువెళ్లాలని పథకం వేసింది. ఫుట్‌పాత్‌పై ఉన్న వారినే టార్గెట్‌గా చేసుకుని ఇమ్రాన్‌తో కలిసి కరిష్మాను ఎత్తుకుపోయింది. కొద్దిదూరం వెళ్లాక బాలికగా తేలడంతో శివకుమార్‌ను కిడ్నాప్ చేసింది. పోలీసులు ఎంతగా విచారించినా తన కుమారుడిని ఏం చేసిందనేది పర్వీన్ చెప్పలేకపోతోంది. అరెస్టు, పోలీసు కస్టడీలోనూ ఆమెకు ఏమీ గుర్తుకురాలేదు. దీంతో గడిచిన 20 రోజులుగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ బాలుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. పర్వీన్ ఈ బాలుడిని ఎక్కడైనా వదిలేసిందా? ఎవరికైనా విక్రయించిందా? అనే కోణాల్లోనూ ఆరా తీస్తున్నారు.